క్లుప్తంగా

నేడు 'ప్రజా దర్బార్' రద్దు

తాడేపల్లిరూరల్: మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలోని తన నివాసంలో సోమవారం 35వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి ఎంతోమంది నిరుపేదలు, డయాలసిస్ పేషంటర్లు, దివ్యాంగులు తమకు పెన్షన్ కావాలని అర్జీలు అందజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను విన్నవించారు. తాడికొండ నియోజకవర్గంలోని గుండాల పేటకు చెందిన ముస్లింలు స్థలం కేటాయించి సాధికార నిర్మాణం చేయాలని కోరారు. ఈ అర్జీలన్నింటిని పరిశీలించి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి నారా లోకేష్ వారికి హామీ ఇచ్చారు. మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది ఈ సందర్భంగా తెలియజేశారు. తిరిగి మరలా ఎప్పుడు ప్రజా దర్బార్ నిర్వహిస్తారో పత్రికాముఖంగా తెలియజేస్తామన్నారు.

మహానాడులో చోరీ

తాడేపల్లింరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మహానాడులోని ఓ నివాసంలో చోరీపై పోలీసులకు బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు చాగంటి శివకుమార్ వివరాల మేరకు ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో వెనుక తలుపులు తీసి కూలర్ పెట్టుకుని నిద్రిస్తుండగా ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. రెండు సెల్ ఫోన్లు, చీటీ పాడగా వచ్చిన రూ.58 వేల నగదులో ఇంట్లో దాచిన రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

తాడేపల్లిం రూరల్: దుగ్గిరాలలోని డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో సోమవారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ లంచగొండితనాన్ని ఎవరూ ప్రోత్సహించకూడదన్నారు. అవినీతి రహిత భారతదేశానికి అందరూ తమవంతు సహకారం అందించాలని అన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజిలెన్స్ అధికారి ఎన్‌వీ విజయ్‌కుమార్, విజిలెన్స్ ఇన్‌చార్జి ఇ.రాంబాబు, బ్యాంక్ మేనేజర్ కృష్ణ మోహన్, ఫణి, బ్యాంక్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ కె.గిరిధరరావు, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

లక్ష్మీపురం: ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్, విద్యా సంస్థలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి అని కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.యశ్వంత్, షేక్ సమీర్ మాట్లాడుతూ గుంటూరు లో ఉన్న కోడి గుడ్డు సత్రం హాస్టల్‌ను ప్రారంభించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు మూడు వేల కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దాసు, సురేష్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో మీడియాపై ఆంక్షలు


నగరంపాలెం: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలో మీడియాపై మరోసారి ఆంక్షలు విధించారు. జిల్లా ఎస్పీగా సతీష్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది రెండోసారి. డీపీఓలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు వచ్చే బాధితుల సమస్యలను కవరేజి నిమిత్తం స్పందన హాల్ వద్దకు మీడియా వచ్చేవారు. జిల్లా నలుమూలాల నుంచి వచ్చే అర్జీదారుల వివరాలను సేకరించేవారు. విలేకర్లపై విధించిన ఆంక్షలను జిల్లా ఏఆర్ ఏఎస్పీ హనుమంతు తెలిపారు. దీంతో డీపీఓలో విధించిన ఆంక్షలపై రాష్ట్ర, రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. చెట్ల కింద విలేకరులు నిరసన తెలిపారు. విలేకర్లతో డీఎస్పీ బి.సీతారామయ్య చర్చలు జరిపారు. ఎస్‌బీ డీఎస్పీ జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. డీపీఓలోకి మీడియాను అనుమతించారు.

జిల్లా ఎస్పీని కలిసిన ప్రజా సంఘాల నాయకులు

నగరంపాలెం: ప్రజా సంఘాల నాయకులు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరు నగరంలో నెలకొన్న ట్రాఫిక్, రహదారుల ఆక్రమణ, సీసీ కెమెరాల పనితీరుపై చర్చించారు. అనంతరం వాటిపై జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించారు. బహుజన్ మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కన్వీనర్ సాధం మాల్యాద్రి, జిల్లా రజక జనసేవ సంఘం నాయకులు వట్టికూటి సాంబయ్య, బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్, బీపీ మండల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు సాంబయ్య, నల్లపు నీలాంబరం, ముస్లిం మహిళా నాయకురాలు షేక్ సలీమా, ఆవాజ్ నగర అధ్యక్షుడు షేక్ సైదా, ముదిరాజ్ సంఘం నాయకులు బ్రహ్మయ్య, నగర రజక జనసేవ సంఘం నాయకులు మహేంద్ర, టి.రాము పాల్గొన్నారు.

ప్రోస్టేట్ మగవారికి మాత్రమే..

- క్యాన్సర్ ఆధునిక వైద్యసేవలతో నయం
- సెప్టెంబర్ నెల ప్రోస్టేట్ క్యాన్సర్ అవగాహన మాసం



ప్రోస్టేట్ క్యాన్సర్ పోస్టర్

గుంటూరు మెడికల్: కేవలం మగవారికి మాత్రమే వచ్చే వ్యాధుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధి 50 ఏళ్లు పైబడిన వారిలో కనిపిస్తుంది. వ్యాధిని సకాలంలో గుర్తించకపోతే శరీరంలోని ఇతర అవయవాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది.

వ్యాధి సోకిన విషయం కూడా తెలియకుండానే ఇతర యూరాలజీ సమస్యలతో వైద్యం కోసం వెళ్లేవారిలో ఈ వ్యాధిని గుర్తిస్తున్నారు. జీవితం అర్ధభాగంలో సంభవించే క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చు. 1989 నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలను జాతీయ ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ప్రజలకు ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు అవసరం ఉంది.

వ్యాధి లక్షణాలు....

ప్రోస్టేట్ గ్రంథి మగవారి మూత్రనాళం కిందద ఉంటుంది. ఇది వీర్యకణాలను మోసుకెళ్లే ద్రవ పదార్థాన్ని తయారు చేయటం, లైంగిక సంపర్కం చేయటానికి దోహద పడుతుంది. సైలెంట్ కిల్లర్‌గా పిలువబడే వ్యాధి సోకినట్లు తెలుసుకోవటానికి వ్యాధి లక్షణాలు చాలా వరకు బయటపడకపోవటంతో వ్యాధి నిర్ధారణ త్వరితగతిన జరగటం లేదు. అంగస్తంభన చాలా కష్టంగా ఉండటం, వీర్య స్థలనం చేసే సమయంలో నొప్పి రావటం, వీర్యం తగ్గిపోవటం, దీర్ఘకాలికంగా వెన్నుముకనొప్పి, తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లటం, మూత్ర విసర్జనలో తొందరపాటు, అధికంగా మూత్రం వస్తున్నట్లు ఉండటం, మూత్ర విసర్జనకు చాలా సమయం తీసుకోవటం, మూత్రంలో రక్తం రావటం, రాత్రి నిద్రిస్తున్న సమయంలో మూత్ర విసర్జన వలన నిద్రాభంగం అవ్వటం, ఎముకలు నొప్పులు, కాళ్ల వాపులు, పొత్తికడుపు ఇబ్బందిగా ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ

క్యాన్సర్ రావటానికి నిర్దిష్ట కారణాలు తెలియవు. ఎర్రటి మాంసం, అధిక కొవ్వు శాతం ఉన్న ఉత్పత్తులు, శుభ్రం లేకుండా వండిన మాంసం ఎక్కువగా తినటం వలన వచ్చే అవకాశాలు ఉన్నాయి. 50 ఏళ్లు పైబడిన మగవారిలో ఎక్కువ మంది వ్యాధి బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి బుధవారం, శనివారం యూరాలజీ వైద్య విభాగంలో వారానికి ఇద్దరు లేదా ముగ్గురు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. జీజీహెచ్‌కు వచ్చే వారిలో అధికశాతం మంది వ్యాధి ముదిరిన తరువాత వస్తున్నవారే. జిల్లాలో సుమారు 30 మంది యూరాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతి నెలా పదిమంది వరకు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి...



ప్రోస్టేట్ క్యాన్సర్ కుటుంబంలో ఒకరికి వస్తే ఇతరులు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు. జన్యుపరమైన కారణాలతో ఈ వ్యాధి సోకుతుంది. సీరం పీఎస్ఏ పరీక్ష ద్వారా వ్యాధి వస్తుందా లేదా అనే విషయాన్ని నిర్ధారించవచ్చు. ఒత్తిడి వల్ల క్యాన్సర్ పెరిగే ప్రమాదం ఉంది. యోగా, వ్యాయామం చేయటం మంచిది. క్రమం తప్పకుండా వేళకు భోజనం చేయటం, క్యాన్సర్‌ను చంపే ఆహారమైన క్యాబేజ్, క్యాలీఫ్లవర్, పచ్చని ఆకుకూరలు, చేపలు ఆహారంలో తీసుకోవాలి.

–డాక్టర్ జొన్నకూటి కొర్నేలియస్, యూరాలజిస్ట్, గుంటూరు

ఆధునిక చికిత్సలతో నయం చేయవచ్చు...



ప్రోస్టేట్ క్యాన్సర్ చాలా చిన్నగా పెరుగుతుంది. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయటం వలన పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్ సోకినవారు పీఎంఎస్ పెట్‌స్కాన్ పరీక్ష చేయించుకోవటం ద్వారా శరీరంలో ఏఏ భాగాల్లో క్యాన్సర్ సోకిందో తెలుసుకుని చికిత్స చేయవచ్చు. ఆపరేషన్లు, రేడియేషన్ చికిత్స, హార్మోనల్ ట్రీట్‌మెంట్, కీమోథెరపీ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధిని ముందస్తుగా గుర్తించి చికిత్స అందించటం వలన బాధితుడి జీవిత కాలాన్ని పొడిగించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వినతి


కమిషనర్ అలీమ్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి దోభీ ఖానా స్థలంలో నిర్మాణంలో ఉన్న రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని కోరుతూ సోమవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషాకు రజక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. నాలుగు సంవత్సరాల కాలపరిమితిలో సిమెంటు పిల్లర్లపై స్లాబ్ మాత్రమే పూర్తి చేయడం జరిగిందని, గదుల నిర్మాణాలు, ప్రహరీ, ఫ్లోరింగ్, గేటు, వంట గది నిర్మాణాలు, కరెంటు, వాటర్ డ్రైనేజ్ వంటి సౌకర్యాలు పూర్తి చేయాలేదన్నారు. ఈ కారణంగా కమ్యూనిటీ హాల్ ప్రజా వినియోగంలోని రాలేదన్నారు. స్పందించిన కమిషనర్ అలీమ్ బాషా రెండు మూడు రోజుల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల దశను స్వయంగా పర్యవేక్షిస్తామని, తదుపరి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, మంగళగిరి తాడేపల్లి నగన సంఘం కమిటీ గౌరవాధ్యక్షులు మోర్‌తోట సుబ్బారావు, అధ్యక్షులు ఉండవల్లి పార్థసారథి, కొత్తపల్లి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసిన వారికి గుర్తింపు


మాట్లాడుతున్న తాడికొండ సీఐ కె.వాసు

తాడికొండ: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు తప్పక ఉంటుందని తాడికొండ సీఐ కె.వాసు అన్నారు. సోమవారం తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ ప్రమోషన్‌తో కూడిన బదిలీపై వెళుతున్న అంజయ్య, ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అందరి మన్ననలు పొంది తాడికొండ పోలీస్ స్టేషన్‌లో తమదైన గుర్తింపు తెచ్చుకున్న సీఐ అంజయ్య, ఏఎస్ఐ వెంకటేశ్వర రెడ్డి జీవితంలో మరిన్ని ప్రమోషన్లు తెచ్చుకొని ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఇద్దరినీ శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జోజి, ఏఎస్ఐ కొండలు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తదితరులు

పట్నంబజారు: గంజాయి విక్రయించినా, సరఫరాకు సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజాయి విక్రయాలు, చోరీల నియంత్రణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపడతున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, వాటి నియంత్రణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈస్ట్ పరిధిలో అర్ధరాత్రి సమయంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా దుకాణాలు రాత్రి 11 గంటలకు మూసివేయాలని సూచించారు. పోలీసు అత్యవసర సేవలకు సంబంధించి 112 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. నిబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి సమాచారాన్ని 112 నంబరుకు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ సీఐలు శివప్రసాద్, వైవీ సోమయ్య, వీరయ్య, పాల్గొన్నారు.

రైతులకు పశువుల మేత అందజేత


రైతులకు పశువుల మేత అందజేస్తున్న సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: చిర్రావూరు గ్రామంలోని రైతులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ రైతు సంఘం నాయకులతో కలసి సోమవారం పశువుల మేతను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, కృష్ణానది వరదల కారణంగా లంక గ్రామమైన చిర్రావూరులో పశువులకు మేత లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెల్లూరు నుంచి వరిగడ్డి 100 మోపులు తీసుకొచ్చి రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రెండు గ్రామాలను దత్తత తీసుకుని వరిగడ్డి, పశువుల దాణాను అందజేశామని తెలిపారు. కృష్ణాజిల్లా కుటికల పూడి గ్రామంలో వరిగడ్డి, దానా టీఎంఆర్ సప్లైచేసే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వరదల సమయంలో 75 టన్నులు పశువుల దానా ఇవ్వడం జరిగిందన్నారు. రైతు సంఘం మంగళగిరి కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పలు సంఘాల నాయకులు పి. జమలయ్య, మునుసూర్ సుహాస్, ఎంఆర్ ప్రసాద్, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మంగళగిరి కార్యదర్శి జాలాది జాన్‌బాబు, ఏడీ డాక్టర్ శ్రీనివాస్, పశువైద్యాధికారి డాక్టర్ నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని రైతులందరూ తప్పని సరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె. శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు, ఈకెవైసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు, ఇన్సూరెన్స్, నష్టపరిహారం వర్తించాలన్నా పంట నమోదుకు ఈకెవైసీ తప్పనిసరి అని తెలిపారు.

వారెంట్ నిందితుడి అరెస్ట్

మంగళగిరి: మండలంలోని నవులూరుకు చెందిన అజ్మీర్ నాయక్ అనే వ్యక్తి రాబరీ, డెకాయిట్, హత్యాయత్నం కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. కోర్టుకు హాజరు కావడం లేదు. సోమవారం రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాల మేరకు.. అజ్మీర్ పరారీలో ఉండగా సోమవారం గుంటూరులో అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరుపరచినట్లు చెప్పారు. కోర్టు నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఫైనాన్స్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డికి సన్మానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైనాన్స్ ఆఫీసర్ గా విధులు నిర్వహించిన ఎం.చంద్రశేఖర్ రెడ్డి యూనివర్సిటీ నుంచి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని పరిపాలనా భవన్‌లో సోమవారం చంద్రశేఖరరెడ్డికి సన్మాన సభ నిర్వహించారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం సన్మానించారు. యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి విలువైన సేవలు అందించారని కొనియాడారు. చంద్రశేఖర్ రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం ఏఎన్‌యూ అకౌంట్స్ విభాగంలో డెప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉన్న ఏ వెంకటేశ్వర్లుకు యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

ఆర్థిక సాయం అభినందనీయం

పట్నంబజారు: ఆపదలో ఉన్న వారికి సాయం అందించడం ఎంతో అభినందనీయమని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. నెహ్రూనగర్ ప్రాంతంలో మున్సిపాలిటీ వర్కర్‌గా పనిచేస్తున్న రమణమ్మ ఏడాదిన్నర బిడ్డ గుండె సంబంధింత సమస్యతో బాధపడుతుండగా తిరుపతిలో చిన్నారికి ఆపరేషన్ చేయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నెహ్రూనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటా శివనాగేశ్వరరావు కార్మికురాలికి రూ.75 నగదు ఆర్థిక సాయంగా అందజేశారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, కొత్తపేట పోలీస్ స్టేషన్ సీఐ ఎం వీరయ్య చేతుల మీదగా నగదును కార్మికురాలికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటా శివనాగేశ్వరరావు, సభ్యులు బండి రాంప్రభూ, శంకర్, గట్టు శీను, వినోద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు సోమవారం విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పట్టించుకోవాలంటూ ప్లకార్డులు చేతితో పట్టుకుని, మెడలో వేసుకుని పెద్దఎత్తున నినాదాలు చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ఇవ్వకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్ కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


మెడికల్ క్యాంపును ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివన్నారాయణ

తాడేపల్లిరూరల్: ప్రకాష్ నగర్, అంబేడ్కర్ కాలనీ (డ్రైవర్స్ కాలనీ)లో సోమవారం అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాల మేరకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించామని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివన్నారాయణ మెడికల్ క్యాంపును ప్రారంభించారన్నారు. పట్టణ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులందరికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశామని ఆమె తెలిపారు. నవులూరులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గార్బేజ్ డంపింగ్ యార్డ్ పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ అలీమ్‌బాషా తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె. విజయలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ మన్‌మోహన్, డీసీహెచ్ఎస్ ఏవో డాక్టర్ మజీదా, కుంచనపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.నాగేంద్రబాబు, సీహెచ్ఓ గురుకుమార్, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, డీఈ కృష్ణారెడ్డి, హాస్పిటల్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, టీడీపీ ఇన్‌చార్జి వి.వెంకటరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులతో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ థెరీసమ్మ

ఫిరంగిపురం: క్రీడల్లో రాణించి, ఉన్నత స్థానం సాధించవచ్చని సెయింట్ ఆన్స్ స్కూల్ హెచ్ఎం సిస్టర్ ఒట్టి థెరీసమ్మ అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో సోమవారం హ్యాండ్ బాల్ క్రీడాకారుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్-15 సబ్‌జూనియర్ బాలికల అంతర్జిల్లాల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ ఈ నెల 21న కడప జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారని తెలిపారు. గుంటూరు జిల్లా తరుపున తమ పాఠశాల క్రీడాకారులు పాల్గొని ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. వారిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ నిర్మల మేరి, వెళాంగిణి రెడ్డి, ఇన్నారెడ్డి, శిల్ప పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలపై వినతి


వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు

మేడికొండూరు: రైతుల కౌలు సమస్యలు పరిష్కరించాలంటూ మండలంలోని జంగంగుంట్ల పాలెం పంచాయతీ పరిధిలోని పొట్లపాడు గ్రామ రైతులు రైతు సంఘం నాయకుడు పి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం వీఏఏ ఎర్రసానికి సోమవారం వినతి పత్రం అందజేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు కౌలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు రకాల డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.లూర్దు, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ఓనమ్



విద్యార్థినుల సంప్రదాయ నృత్య ప్రదర్శన

కేరళ సంప్రదాయ వస్త్రాలతో ఆకట్టుకున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం ఓనమ్ వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కేరళ సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో జాతి, కుల, మతాలకు అతీతంగా జరుపుకునే అతిపెద్ద పండుగ ఓనమ్ అని, మహాబలి చక్రవర్తి తన ప్రజల కోసం ప్రతి యేటా ఓనమ్ రోజున వస్తారనేది ప్రజల నమ్మకమని అన్నారు. ప్రజలు తమ ఇళ్లను పూలతో అలంకరించుకుని, సంప్రదాయ వస్త్రాలను ధరించి బలి చక్రవర్తికి స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. ప్రాంతాలకు అతీతంగా ఓనమ్ పండుగను గుంటూరులో ఘనంగా జరుపుతున్నామని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థినులు కేరళ సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఉండాలి


కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నూరిఫాతిమా తదితరులు

నెహ్రూనగర్: చిరు వ్యాపారులకు అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులకు విన్నవించారు. నగరంలోని చిరువ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర కమిషనర్‌కు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కుటుంబ పోషణ నిమిత్తం ఎటువంటి ఆధారం లేకుండా గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలు కొత్తపేట, రైల్వే గేట్ గణేష్‌నగర్, లాలాపేట, పట్నంబజార్, జెండా చెట్టు సెంటర్‌లలో తోపుడు బండ్లపై వివిధ రకాలు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో కొద్ది రోజుల క్రితం కార్పొరేషన్ సిబ్బంది ద్వారా తోపుడు బండ్లు, ఇతర సామగ్రి తొలగించడంతో వారి జీవనోపాధి దెబ్బతిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వారి జీవనోపాధి కోసం తగిన సహకారాన్ని అందించాలని, దీంతో పాటు వారికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు. డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ చిరువ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకుండా వారికి ప్రత్యామ్నాయ చర్యలు చూపించడానికి కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ ఫర్జాన, మర్రి అంజలి, మల్లవరపు రమ్య, రామనబోయిన అజయ్‌యాదవ్, అబిద్ బాషా, మొహమూద్, యాట్ల రవి, పునూరి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు అగ్గిపెట్టె రాజు, తుమ్మేటి శ్రీను, మర్రి సత్యనారాయణ, దూపాటి సాల్మన్, ఆయూబ్ జానీ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బీఓటీ(బిల్ట్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో ఎన్ని మరుగుదొడ్లు ఉన్నాయి..సులభ్ కాంప్లెక్స్‌లు ఎన్ని ఉన్నాయి...ఎక్కడెక్కడ ఉన్నాయో...వాటిని ఎవరూ నిర్వహిస్తున్నారో తెలియజేయాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్లు పాల్గొన్నారు.